క్లుప్తంగా

సీఎం కప్ హాకీ టోర్నమెంట్‌కు డిగ్రీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి

సీతంపేట: తిరుపతిలో ఈ నెల 29 నుంచి మే 7 వరకు జరగనున్న సీఎం కప్ హాకీ టోర్నమెంట్‌కు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.లక్ష్మి, ఎస్.అనూష, సెకెండ్ బీఎస్సీ ఎస్.రమణి ఎంపికై నట్టు చెప్పారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

సక్రమంగా ఉపాధి పనులు



ఘనసర వద్ద ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

భామిని: మండలంలోని ఘనసర, అత్తికొత్తూరు గ్రామాల పరిధిలో సాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. వేతనదారుల పేర్లను మస్తర్లలో పరిశీలించారు. వేసవి కారణంగా తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎఫ్ఏలకు పలు సూచనలు చేశారు.

వితరణ

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం – అంపిలి గ్రామాల మధ్యనున్న అన్నపూర్ణ ట్రస్టు అనాధాశ్రమ విద్యార్థులకు పట్టణంలోని సత్యసాయి విద్యా సంస్థలకు చెందిన బీజెడ్‌సీ విద్యార్థులు శుక్రవారం ఆహారం అందించారు. అక్కడి పిల్లలకు అవసరమగు తినుబండారాలు, తువ్వాళ్లు, పుస్తకాలను సమకూర్చారు. రోజంతా ఆశ్రమ విద్యార్థులు వారితో కలసి ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గవర గురునాధరావు, ఉపాధ్యాయురాలు వి.ఉమారాణి తదితరులున్నారు.

వేతనాల చెల్లింపు



పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందజేస్తున్న కార్యదర్శి అనసూయ

భామిని: మండలం నేరడి–బి పంచాయతీలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందికి శుక్రవారం ఎనిమిది నెలల వేతనాలు కార్యదర్శి లోవ అనసూయ అందించారు. సర్పంచ్ సరిసాబద్ర జగదాంబ సూచనల మేరకు వేతనాలు అందిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. పారిశుద్ధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసీడర్లకు వేతనాలు చెల్లింపులు చేడతామన్నారు. సచివాలయ వెల్ఫేర్ అధికారిణి ఆర్.సుధారాణి, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు చేరువగా సచివాలయ సేవలు



వీరఘట్టం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

వీరఘట్టం: పల్లె ప్రజలకు సంక్షేమ పాలన చేరువ చేసేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ సేవలను ప్రజలకు సకాలంలో అందేలా చూడాలని డివిజనల్ లెవెల్ డవలప్‌మెంట్ అధికారి వి.గోపాలకృష్ణ సూచించారు. వీరఘట్టం మేజరు పంచాయతీలోని నాలుగు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఇక్కడ అందుతున్న పౌర సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

రైస్ మిల్లర్లతో సమావేశం

సీతంపేట: సివిల్ సప్లై అధికారులు శుక్రవారం స్థానిక గోదాంలో రైస్‌మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డీఎం కెవీఎల్ఎన్ మూర్తి, డీఎం దేవుల నాయక్ నాలుగు మండలాల రైస్ మిల్లర్లతో మాట్లాడుతూ ప్రభుత్వానికి ఇవ్వాల్సిన పెండింగ్ బియ్యం అందజేయాలని సూచించారు. ఇంకా ఏపీ రైస్ మిల్లర్లు బకాయిలు ఉన్నాయనేది తెలుసుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



చినగీసాడలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: అర్హులందరికీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో లబ్ధిని చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని వనకాబడి గ్రామ సచివాలయం పరిధిలోని దిగువ దేరువాడ, తుమ్మిగూడ, చినగీసాడ గ్రామ సచివాలయం పరిధిలోని గద్రజోల, చినగీసాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులు, గ్రామ సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే గ్రామస్తుల నుంచి వచ్చిన వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడం చేశారని, పేద ప్రజల గురించి ఏనాడూ ఆలోచించలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే చేర్చారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎస్సీ, ఎస్టీ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్, వనకాబడి, చినగీసాడ సర్పంచ్లు నిమ్మక కొసమ్మ, నిమ్మక శాంతి, బూత్ కన్వీనర్లు ఈశ్వరరావు, మిన్నారావులతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

గడప గడపలో నవరత్న కాంతులు



: జగతపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

● ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: నవరత్న పథకాలతో ప్రతీ గడపలోనూ సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని దేవనాపురం గ్రామ సచివాలయ పరిధిలో జగతపల్లి, పక్కల జంతిలిగూడ, నాయుడుగూడ, దీసరిగూడ, రామన్నగూడ, మద్యగూడ, బుర్జగూడ, రుక్మిణిగూడ తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తమ గ్రామాలకు ఎమ్మెల్యే రావడంతో మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అందుతున్న వైనంపై ఆరా తీశారు. అర్హత ఉండి సాంకేతిక పరమైన సమస్యలతో పథకాలు ఆగితే వినతులు ఇవ్వాలన్నారు. వెంటనే పరిష్కారమౌతాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో అందరికీ సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు నాలుగేళ్లలో 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మౌనిక, సుశీల, తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, ఎం.రామారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

పాలకొండ: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను శనివారం వేలం వేస్తామని ఎస్ఐ గోపాలకృష్ణ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 11 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు, బొలెరో పికప్ వాహనం వేలంలో ఉంచుతామని తెలిపారు. ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహిస్తామని ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చాపరాయి బిన్నిడి పంచాయతీ మూలిగూడ గ్రామంలో మెగా యూత్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభమైంది. పోటీలను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, సర్పంచ్ ప్రతినిధి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ ఈ టోర్నీని స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. క్రీడలతో మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. పోటీలకు ఆంధ్రా,ఒడిశాల నుంచి 68 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

సంఘ సంస్కర్త కాళ్లకూరి

పాలకొండ రూరల్: మహాకవి కాళ్లకూరి నారాయణరావు 153వ జయంత్యుత్సవాలను స్థానిక ఎలైట్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. తొలిత కాళ్లకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత సంక్షేమాధికారి కె.సూరన్నాయుడు మాట్లాడుతూ నాటక కర్త, సంఘ సంస్కర్త, జాతీయవాది, మహాకవి బిరుదాంకితుడు కాళ్లకూరి అన్నారు. ఆయన రచనలు, కళా రంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సాహిత్యాభిమానులు, విశ్రాంత ఉద్యోగులు కె.చౌదరినాయుడు, చింతా భాస్కరరావు, ఎం.సత్యం పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

సీతంపేట: కార్మిక హక్కుల దీక్షా దినం మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. మే డే వారోత్సవాల్లో భాగంగా ఊరేగింపులు, సభలు అన్ని ప్రాంతాల్లో జరపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు సురేష్, కాంతారావు, రోయబారీ, దర్శిమి, పార్వతీ, ఉషా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ ప్రారంభం



బత్తిలి సమీపంలో రోవర్‌తో సరి చూస్తున్న సర్వే బృందం

భామిని: మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు – శాశ్వత భూ సర్వేలో భాగంగా ముమ్మరంగా స్టోన్ ప్లాంటేషన్ కొనసాగుతోంది. బత్తిలి మేజర్ పంచాయతీ పరిధిలో సరిహద్దు కొలత రాళ్లు వేసే కార్యక్రమాన్ని మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, డీటీ ఎల్.రమేష్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. సర్వే రోవర్‌తో సరిహద్దులు సరిచేసి రైతుల సమక్షంలో స్టోన్ ఫిక్సేషన్ అరంభించారు. సుమారు 12 వందల మంది రైతులకు చెందిన సుమారు 1969 ఎకరాల జిరాయితీ భూములు రైతులకు అప్పగించడానికి భూ సరిహద్దులలో కొలత రాళ్లు వేసే పనులు ఆరంభించారు. వీఆర్ఓలు దుర్గా ప్రసాద్, సిర్ల జయరాజ్, జె.మోహనదాస్, సహాయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ట్యూషన్ మాస్టారు కుటుంబానికి సాయం



వెంకటరమణ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎస్ఐ, స్థానిక యువత

కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేటకు చెందిన పెదపెంకి వెంకటరమణ(గుడ్డి మాస్టారు) తీవ్ర అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా ఆయన చిన్నకుమార్తె చంద్రకళ తలకొరివి పెట్టిన విషయం పాఠకులకు విదితమే. ఈ మేరకు స్థానిక యువత, పూర్వ విద్యార్థులు మాస్టారు కుటుంబాన్ని ఆదుకోవాలన్న సంకల్పంతో వాట్సాప్ గ్రూప్‌లో విషయం తెలియ పరచగా దాతలు అంతా 22 వేలు రూపాయలు వరకు వితరణగా అందజేయగా, పూర్వ విద్యార్థులు రూ.11 వేలు వితరణగా శుక్రవారం అందజేశారు. మొత్తం రూ.33 వేలు వెంకటరమణ మాస్టారు కుటుంబ సభ్యులకు కురుపాం ఎస్ఐ సి.హెచ్.ప్రసాద్, స్థానిక యువత పృధ్వీ, గౌరి, నాగరాజు, సంతోష్ తదితరులు కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఘనంగా అసిరితల్లి ఉత్సవాలు



అమ్మవారి ముఖచిత్రంతో కూడిన రంగవల్లి వేయటంలో నిమగ్నమైన మహిళలు

పాలకొండ రూరల్: మండలంలోని కొండాపురంలో 64 ఏళ్ల తరువాత జరుగుతున్న అసిరితల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి పాలజంగిడికి గ్రామ వీధుల్లో తిరువీధి శుక్రవారం చేపట్టారు. సాంప్రదాయబద్ధంగా స్థానికులు అమ్మవారికి వేపాకులతో కూడిన ముర్రాటలు సమర్పించారు. నృత్య ప్రదర్శనలు, ముగ్గుల పోటీల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభ కనపర్చారు. అక్కడి మహిళలు, యువతులు తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందించారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ



వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీఓ

జియ్యమ్మవలస: మండలంలోని ఆరు పంచాయతీలలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఎంపీడీఓ ఎస్.రమేష్ శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. పెదతోలుమండ, కుదమ గ్రామాలలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఒకరు కూడా ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. మిగిలిన నాలుగు ఖాళీలకు ఏడుగురు హాజరయ్యారని ఎంపీడీఓ తెలిపారు. జియ్యమ్మవలస నుండి ముగ్గురు, గవరమ్మపేట నుంచి ఇద్దరు, అంకవరం, బాసంగి నుంచి ఒక్కొక్కరు చొప్పున హాజరయ్యారని తెలిపారు.

● జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా శుక్రవారం పలుచోట్ల జరిగింది. సీతంపేటలోని దేవనాపురం సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాల్గొన్నారు. ఇతర మండలాల్లో కూడా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కురుపాం: మొండెంఖల్ పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా జీలుగుమానుగూడలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



సీతంపేట: మద్యగూడలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి



పాలకొండ రూరల్: బెజ్జిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం అన్నారు. మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. ఏ ఒక్కరూ బడి మానకూడదని, డ్రాపౌట్‌గా ఉండరాదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను స్కూల్‌కు పంపించాలన్నారు. ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించి అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలన్నీ నాడు – నేడు ప్రోగ్రాం ద్వారా కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.ఆనందరావు, సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నెల్లి సత్యం నాయుడు, హెచ్ఎం ప్రసాదరావు, విద్యా కమిటీ చైర్మన్ ఆరిక కళావతి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పాలక కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు అందజేత



నివేదికలను అధికారులకు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు

పాలకొండ రూరల్: ఐటీడీఏ పీఓ కల్పన అదేశాల మేరకు మండలంలోని నివసిస్తున్న పీటీజీల వివరాలు, వారి ఆవాసాల్లో ఉన్న సౌకర్యాలపై సిద్ధం చేసిన జాబితాలను సచివాలయ, పంచాయతీ సెక్రటరీలు సిద్ధం చేశారు. ఈ నివేదికలను శుక్రవారం ఎంపీడీఓ డొంక త్రినాధులు నేతృత్వంలో ఐటీడీఏ ప్రాజెక్టు టెక్నికల్ అధికారి హరికృష్ణకు అందించారు. ముఖ్యంగా మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న సవర, గదబ, కాపుసవరల సంఖ్య, వారుకి అవసరమైన వసతులు, ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, రహదారులు, విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థల తాజా స్థితిగతులు ఈ నివేదికల్లో క్రోడీకరించినట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ గృహ నిర్మాణాలకు సంబంధించి 479 మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. వీటికి మ్యాపింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలన్నారు.

కంట్రోల్ పాయింట్లు ఏర్పాటు



పట్టణంలో డ్రోన్ పై కంట్రోల్ పాయింట్లు నిర్దేశిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న శాశ్వత భూ హక్కు కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఇప్పటివరకు మండలంలో జరిపిన సర్వే సిబ్బంది ప్రస్తుతం పాలకొండ అర్బన్‌పై దృష్టి పెట్టారు. పట్టణంలోని భూములు, గృహాలు, స్థలాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించే క్రమంలో డ్రోన్ సర్వే చేపట్టేందుకు కావాల్సిన గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ఏర్పాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం అర్బన్‌లో 37 పాయింట్లు నిర్ణయించారు. అతి త్వరలో డ్రోన్ పై కార్యక్రమం నిర్వహిస్తామని టీపీబీఓ మూర్తిశ్రీ తెలిపారు. ఆయన వెంట వార్డు ప్లానింగ్ సెక్రటరీలు ఆర్.సాయినాద్, ఎస్.నాయుడు, ఎం.శ్రీనివాస్ తదితరులున్నారు.

రెండు పూటలు పని చేయండి



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులు రెండు పూటలా కచ్చితంగా పని చేయాలని ఎంపీడీఓ ఎల్వీ అప్పారావు అన్నారు. మండలంలోని కళ్లికోట గ్రామంలో రణమత చెరువు వద్ద పని చేస్తున్న వేతనదారులతో శుక్రవారం మాట్లాడారు. అనంతరం గ్రామ సచివాలయానికి వెళ్లిన ఆయన అక్కడ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చాలన్నారు. క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి హామీ మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ పరిధిలో ఉన్న గౌరీసాగరంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ శుక్రవారం పరిశీలించారు. ఉపాధి పనులకు వేతనదారులు ఎంతమంది వస్తున్నదీ.. లేనిది మస్తర్లను పరిశీలించారు. కొందరు పనులకు రాకపోయినప్పటికీ హాజరు వేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఉపాధి పనులకు రెండు పూటలా రావాలని, ఒక పూట రాకపోయినప్పటికీ హాజరు వేయరాదని సూచించారు. ప్రతిరోజు టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓ ఏదో ఒకచోట పర్యవేక్షణ చేయాలన్నారు. ఈసీ తేజ ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలి



సమావేశంలో పాల్గొన్న ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు

గరుగుబిల్లి: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మరింత బలోపేతం కావాలని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని గిజబ గ్రామంలో రైతు ఉత్పత్తిదారులతో క్లస్టర్ స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలువ హెచ్చింపు ఎలా చేయాలనే దానిపై అన్నపూర్ణేశ్వరీ, గిరిశక్తి, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు మురహరిరావు, ఎం.లక్ష్మి వివరించారు. చిరుధాన్యాలతో వివిధ రకాల వంటకాలను తయారుచేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

జరడలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అభినవ్‌కుమార్

కురుపాం: మండలంలోని జరడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నీలకంఠాపురం పీహెచ్‌సీ, 104 ఆధ్వర్యంలో వైద్యాధికారి అభినవ్‌కుమార్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 62 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడే ఫ్రైడేను పాటించాలని, హైరిస్క్ గర్భిణులను వీలైనంత వరకు పీహెచ్‌సీ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండేలా చూడాలని, లేకుంటే వైటీసీకి రిఫర్ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, ఎం.ఎల్.హెచ్. పి.లలిత, హెల్త్ అసిస్టెంట్ జగన్నాధం, ఏఎన్ఎంలు సువర్ణ, జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కళావతి అన్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పన కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో పనులు కేటాయించినప్పటికీ ఇంతవరకు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పనులు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. పనులు పూర్తి చేయకపోతే తాము వార్డుల్లో ఎలా తిరిగేదని ప్రశ్నించారు. కమిషనర్ స్పందిస్తూ ఇంతవరకు కేటాయించిన పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలు అభివృద్ధి పనులకు తీర్మానించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ రౌతుహనుమంతురావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.